క్లుప్తంగా

న్యూరాలజీ వార్డుకు ఎల్ఈడీ టీవీ బహూకరణ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డుకు రూ.2 లక్షల విలువ గల ఎల్ఈడీ టీవీని బుధవారం మా అడ్వాన్స్డ్ డయాగ్నస్టిక్ రీసెర్చ్ సెంటర్ అధినేత డాక్టర్ ఎం.ఆదినారాయణరావు అందచేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ టీవీని లాంఛనంగా ప్రారంభించారు. వార్డుకు టీవీ బహూకరించిన డాక్టర్ ఎం.ఆదినారాయణ రావును అభినందించారు. డాక్టర్ ఆదినారాయణ రావును, డాక్టర్ కిరణ్‌కుమార్‌లను న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సుందరాచారి సన్మానించారు. డాక్టర్ అరుణ కుమారి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుతో ఉజ్వల భవిత

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేసిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీలోని ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఈ ఏడాది నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కోర్సుపై అవగాహన, కోర్సు పూర్తి చేసిన తరువాత ఉండే అవకాశాలను తెలియజేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విభాగాధిపతి డాక్టర్ బట్టు నాగరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం గల విద్యార్థులకు ఉద్యోగాలు వస్తున్నాయని ఆ నైపుణ్యాలను అందిపుచ్చుకునే క్రమంలో చదువుతున్న కోర్సుపై అవగాహన, మెలకువలు నేర్చుకోవాలన్నారు. రెండేళ్ల కోర్సులో బోధనతోపాటు అనేక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్.స్వరూప రాణి, కోర్సు ఉద్దేశాలను వివరించారు. విభాగాధిపతి నాగరాజు మాట్లాడుతూ రెండేళ్ల ఈ కోర్సులో బోధించే బోధనా వివరాలను, సబ్జెక్టులను విశదీకరించారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాస్, జి.డేవిడ్ రాజు, డాక్టర్ సాదిక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ అయోధ్య అక్షింతలు

పాత గుంటూరు: శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శమని విశ్వ హిందూ పరిషత్ నగర అధ్యక్షుడు కాళిశెట్టి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీ రామ జన్మభూమి అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో నగర సంకీర్తన, అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని కొత్తపేట శివాలయం ఈఓ తమ్మా శివారెడ్డి, అన్నదాన సమాజం ఈఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రదర్శనగా వెళ్లి నగరంలోని 11 ఆలయాలకు, ఇంటింటికీ తిరిగి అక్షింతలు పంపిణీ చేశారు. అన్నదాన సమాజం చైర్మన్ పోకల వసంత్ కుమార్, పరిషత్ కార్యదర్శి గుండా శ్రీనివాస రావు పాల్గొన్నారు. అక్షింతలు కావాల్సిన వారు కొత్తపేట శివాలయం, అన్నదాన సమాజంలో సంప్రదించాలని ఈఓ శివారెడ్డి తెలిపారు.

హిందీ భాషా చరిత్ర ఎంతో గొప్పది


గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలో హిందీ భాషకు ఘనమైన చరిత్ర ఉందని ప్రభుత్వ మహిళా కళాశాల హిందీ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ కె.విజయకుమారి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విశ్వ హిందీ దివస్ సందర్భంగా అతిథి ఉపన్యాసం జరిగింది. ఈసందర్భంగా కళాశాల హిందీ శాఖాధ్యక్షుడు డాక్టర్ గుడిపూడి విజయరత్న కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో విజయ కుమారి మాట్లాడుతూ హిందీ భాషా చరిత్ర ఎంతో విశేషమైనదని, ఎందరెందరో గొప్ప కవులు హిందీ సాహిత్యాన్ని విస్తృత పరిచారని తెలిపారు. హిందీ భాష చరిత్రను విద్యార్థులు తప్పక తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, ఐక్యుఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.వేణుగోపాల్, అధ్యాపకులు షేక్బాజీ, షేక్ హసీనా, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం గుజ్జనగుండ్లలో నివాస ఉండే ఓ కుటుంబానికి చెందిన పది సంవత్సరాల బాలికతో పక్కనే నివాసం ఉండే 50 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మంగళవారం అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక అతని నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు చెప్పింది. తల్లిదండ్రులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే నిందితుడు తనకు, బాలిక తల్లిదండ్రులకు మధ్య స్థల వివాదం ఉందని, ఈనేపథ్యంలోనే వారు బాలిక చేత తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిలోనే గుర్తిస్తే సర్వైవ్ కావొచ్చు!

- సర్వైకల్ క్యాన్సర్ నివారణకు అందుబాటులో వ్యాక్సిన్
- మహిళలకు వ్యాధిపై అవగాహన అవసరం
- అవగాహన లేమితో ప్రాణాలు కోల్పోతున్న వైనం
- ఇది గర్భాశయ క్యాన్సర్ అవగాహన మాసం



గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ అవేర్‌నెస్ పోస్టర్

గుంటూరు మెడికల్: క్యాన్సర్ సోకితే చనిపోతారనే భయం ప్రజల్లో నేటికీ చాలా మందిలో ఉంది. కానీ కొన్ని రకాల క్యాన్సర్‌లు రాకుండా ముందస్తుగానే వ్యాక్సిన్‌ల ద్వారా నివారించవచ్చు. ఈవిషయంపై అనేక మందికి అవగాహన లేకపోవడంతో క్యాన్సర్ వ్యాధి బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అలాంటి వాటిల్లో గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్) క్యాన్సర్ ఒకటి. మనదేశంలో ప్రతి ఏడాది మూడు లక్షల మంది మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారు. వారిలో 1.25 లక్షల మంది చనిపోతున్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడుతున్న వారిలో గ్రామీణ ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంభవించే క్యాన్సర్‌లలో గర్భాశయ క్యాన్సర్‌లది నాల్గో స్థానం. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి రోజు 150 మంది వివిధ రకాల క్యాన్సర్లతో చికిత్స కోసం వస్తున్నారు. వారిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు ఇద్దరు ఉంటున్నారు. ఈవ్యాధిని ముందస్తుగానే గుర్తించడం ద్వారా ప్రాణాలు పోకుండా కాపాడవచ్చు. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్న గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై అవగాహన కల్పించి వ్యాధి బారిన పడకుండా ప్రజలకు జాగ్రత్తలు వివరించేందుకు ప్రతి ఏడాది జనవరి నెలను గర్భాశయ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు..

గర్భాశయ క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించలేరు. రుతుక్రమ సమయంలో, లేదా లైంగిక సంభోగం తరువాత అసాధారణంగా యోని నుంచి రక్తస్రావం జరుగుతోంది. నడుము నొప్పి, కాళ్ల నొప్పి, కాళ్లవాపు, అలసట, బరువు తగ్గుదల, ఆకలి తగ్గట, చెడు వాసనతో కూడిన యోని స్రావాలు కారడం, యోనిలో గడ్డలు, శృంగార సమయంలో నొప్పి, యోనిలో అసౌకర్యం, యోని నుంచి మలం రావడం, తదితర లక్షణాలు ఉంటాయి.

కారణాలు..

హ్యూమన్ పాపిల్లోమ వైరస్ (హెచ్‌పీవీ) వల్ల ఈ వ్యాధి వస్తుంది. సంపర్కం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సంభవిస్తుంది. ఐదు సంవత్సరాలకన్న ఎక్కువ సమయం గర్భనిరోధక మాత్రలు వాడడం, తక్కువ వయస్సులోనే ముగ్గురికిపైగా పిల్లలకు జన్మనివ్వడం, ధూమపానం, 18 సంవత్సరాల కంటే ముందే లైంగిక సంబంధం కలిగి ఉండటం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం తదితర కారణాలతో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ సోకుతోంది. భాగస్వామితో కాకుండా ఇతరులతో లైంగిక సంబంధాలు కలిగి ఉన్నవారికి కూడా ఇది సోకుతోంది.

రెగ్యులర్ చెకప్ చేయించుకోవాలి...



వ్యాధి లక్షణాలు ప్రారంభంలో కనిపించవు. తొలి దశలోనే గుర్తిస్తే 95 శాతం పూర్తిగా నయం చేయవచ్చు. హై రిస్క్ గ్రూపునకు చెందిన మహిళలు ముందస్తుగా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. 30 నుంచి 49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు కనీసం ఏడాది కొకసారైనా గైనకాలజిస్టులను సంప్రదించి రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకుంటే ముప్పు తప్పించుకోవచ్చు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి,
స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో చెక్



9 నుంచి 12 ఏళ్ల మధ్య వయస్సు వారు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ చేయించుకోవాలి. ఆ వయస్సులో చేయించకపోతే కనీసం 20 ఏళ్లలోపు చేయించాలి. రెండు మోతాదుల్లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. టీకాలు చాలా సురక్షితమైనవి. మహిళలకు వ్యాధిపై అవగాహన లేకపోవడం వల్ల ముఖ్యంగా టీకా అందుబాటులో ఉందనే విషయం తెలియక పలువురు వ్యాధి బారిన పడుతున్నారు.

– డాక్టర్ భైరపనేని స్రవంతి,
క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్లు...



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌కు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. మహిళలకు సోకే క్యాన్సర్‌లలో 25శాతం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లే ఉన్నాయి. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేయించటం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఆపరేషన్ అనంతరం చేసే రేడియేషన్ చికిత్స, కీమోథెరపీ కూడా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు. అత్యాధునిక క్యాన్సర్ వైద్యసేవలు నేడు అందుబాటులో ఉండటం ద్వారా చాలా సులువుగా క్యాన్సర్‌ను కట్టడి చేయవచ్చు.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్,
సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు


జీకేఆర్ హైస్కూల్లో సంప్రదాయ వస్త్రధారణతో సుశీలరెడ్డి, ఉపాధ్యాయినుల బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏటీ అగ్రహారంలోని జీకేఆర్ హైస్కూల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయినులు డ్రెస్‌కోడ్ పాటిస్తూ ఒకే విధమైన వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. పోటీల్లో విజేతలకు పాఠశాల డైరెక్టర్ జి.జనార్దన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుశీలా రెడ్డి బహుమతులు అందజేశారు. జేకేసీ కళాశాలరోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య, ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాటిబండ్ల సీతారామయ్య స్కూల్‌లో ..

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈసందర్భంగా పాఠశాల కమిటీ అధ్యక్షుడు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ ముఖ్య అతిథులుగా పాల్గొని సంబరాలను ప్రారంభించారు. గ్రామీణ వాతావరణాన్ని తలపింపచేసే విధంగా పాఠశాల ప్రాంగణాన్ని అందమైన రంగవల్లులతో తీర్చిదిద్ది, గొబ్బెమ్మలను అలంకరించారు. గంగిరెద్దుల విన్యాసం, కోలాటం, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు భోగిపళ్లు పోసిన ఉపాధ్యాయులు కొత్త బియ్యంతో పొంగలి వండారు. వేడుకల్లో కమిటీ సభ్యులు సూర్యదేవర హనుమంతరావు, గింజుపల్లి వరప్రసాదరావు, ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, ఆలోకం పెద్దబ్బయ్య, మాదల రాజేంద్రప్రసాద్, సంగం డైరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, మదమంచి రవీంద్ర, జొన్నలగడ్డ రామారావు, వల్లూరి తాండవకృష్ణ, డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో మంగయ్య, రవికుమార్


పాటిబండ్ల సీతారామయ్య స్కూల్లో జరిగిన వేడుకల్లో బోధన, బోధనేతర సిబ్బంది

విజ్ఞాన్ స్కూల్‌లో..

గుంటూరు ఎడ్యుకేషన్: ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ స్కూల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ విద్యార్థులకు భోగి, సంక్రాంతి, కనుమ విశిష్టతను వివరించారు. గంగిరెద్దుల విన్యాసం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, జోనల్ ఇన్‌చార్జ్ అనురాధ విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.


విజ్ఞాన్ స్కూల్లో ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయినులు

'మీ గుండె పదిలం' ఆధ్వర్యంలో స్టెంట్ల అమరిక


స్టెంట్‌లు వేసిన వారిని పరామర్శిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

- సీఎం జగన్ పాలన ఆదర్శంగా సేవా కార్యక్రమాలు
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపు ద్వారా ఉచితంగా గుండెకు స్టెంట్ వేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో కార్యక్రమంలో భాగంగా 'మీ గుండె పదిలం' ద్వారా స్టెంట్ వేయించుకున్న కూచిపూడి నాగేంద్రమ్మ, గండికోట శివయ్యలను బుధవారం బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వ్యక్తిగతంగా కలసి పరామర్శించారు. స్టెంట్ వేయించుకున్న వారికి పండ్లు అందజేశారు. గ్రామంలో బజరంగ్ నేత్ర జ్యోతిలో భాగంగా కంటిఅద్దాలు తీసుకున్న గ్రామస్తులు, మహిళలు అంబటి మురళీకృష్ణను కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం ద్వారా ఉచితంగా నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, వికలాంగులకు ట్రై సైకిళ్ళు, ఫిజియోథెరఫీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మురళీకృష్ణ కోరారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలతో నాయకత్వ లక్షణాలు

గుంటూరు ఎడ్యుకేషన్: భావ వ్యక్తీకరణ నైపుణ్యాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడతాయని ప్రముఖ ఔషధ సంస్థ ఎమ్రిక్ కెరీర్ మెంటార్ గోవిందరాజుల నారాయణ ప్రసాద్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు లక్ష్య నిర్దేశనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు ఆంగ్లభాషపై పట్టు, సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్వ్యూలో ప్రదర్శించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పాల్గొన్నారు.

స్టీఫెన్ హాకింగ్ జీవితం స్ఫూర్తిదాయకం

లక్ష్మీపురం: ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ జీవితం ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ మాడభూషి ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ మోటార్ న్యూరాన్ అనే అరుదైన వ్యాధి శరీరాన్ని కబళిస్తున్నా కూడా స్టీఫెన్ హాకింగ్ ఖగోళ పరిశోధనలు చేసి విశ్వవిఖ్యాత శాస్త్రవేత్తగా నిలిచారన్నారు. స్టీఫెన్ హాకింగ్ పట్టుదల, ఆత్మస్థైర్యం ముందు మృత్యువు తలవాల్చిందన్నారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తర్వాత అంతటి సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగే నన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ విశ్వం పుట్టుక, సరిహద్దులు, భవిష్యత్తు, మరెన్నో ఆసక్తికరమైన విషయాల్ని బహుజనరంజకంగా ప్రజల భాషలో చెప్పిన శాస్త్రవేత్త హాకింగ్ అన్నారు. కార్యక్రమంలో యోగాచార్యులు ఇందుశేఖర్, విశ్రాంత బ్యాంకు మేనేజర్ నరసింహారావులు స్టీఫెన్ హాకింగ్ సాధించిన విజయాలు, ఆయన వచ్చిన పురస్కారాలు, పరిశోధనలు ప్రపంచ ప్రజలకు ఉపయోగపడిన తీరుగురించి తెలియజేశారు.

ధైర్యం, స్ఫూర్తికి ప్రతీక స్వామి వివేకానంద


వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ధైర్యం, స్ఫూర్తికి ప్రతీక స్వామి వివేకానందుడని ఇన్‌ట్యాక్ రాష్ట్ర కో–కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో అంతర్ కళాశాలల యూజీ, పీజీ విద్యార్థులకు 'నేటి యువతపై స్వామి వివేకానందుని ప్రభావం'పై వ్యాసరచన, దేశ పురోగతిలో యువత పాత్రపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువత సందర్భానుసారం మాట్లాడటంతో పాటు స్వాభిమానం, మాట్లాడిన మార్గాన్నే అనుసరించడం స్వామి వివేకానందుని నుంచి స్వీకరించాల్సిన లక్షణాలని వివరించారు. జాతీయ భావన, దేశాన్ని మహోన్నత స్థానంలో ఉంచగలిగిన వ్యక్తిగా స్వామి వివేకానంద, ఆది శంకరుల మార్గాన్ని 20వ శతాబ్దంలో ప్రపంచానికి అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం తెలుగు వ్యాసరచన యూజీ విభాగం నుంచి బి.యశస్విరామ్, వై.బ్రహ్మేశ్వరి, ఎస్.భావన, ఆంగ్లంలో కె.ఉమా మహేశ్వరి, డి.జ్ఞానశ్రీ నవ్య, వి.పూజిత మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. అదేవిధంగా పీజీ విభాగంలో తెలుగు వ్యాసరచనలో ఎం.భార్గవ్, షేక్ రంజాన్, డి.బాబు, ఆంగ్లంలో పి.నికిత, టి.దుర్గాభవానీ, పి.చంద్రిక మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఆంగ్ల వక్తృత్వం పోటీలో యూజీ విభాగం నుంచి జీఎల్‌వీ అంజనా, టీకే ఉమామహేశ్వరి, ఎస్.జాయ్ సీ వినుత, వక్తృత్వం పీజీ విభాగం తెలుగులో టి.గిరీష్, షేక్ కంచావలీ, ఎ.హేమంత్, ఆంగ్లంలో ఎం.అనూష, బి.రామ్ అభిలాష్ నాయక్, ఎండీ జవేరియా తొలి మూడు స్థానాల్లో బహుమతులు గెలుపొందారు. విజేతలకు గురువారం బహుమతి ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ట్యాక్ సభ్యులు పి.రామచంద్రరాజు, డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, వేణుగోపాల్, ఎంబీఏ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఎ.బాజీబాబు, వి.అభిలాష్, అనిత, ఎం.మణికంఠ, డాక్టర్ గోపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకం..

గుంటూరు ఎడ్యుకేషన్: యువతరంలో చైతన్యాన్ని నింపిన స్వామి వివేకానందుడు మానవ జాతి మనుగడ సాగించినంత వరకు నిలిచే ఉంటారని ఏటీ అగ్రహారంలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు టి. రవి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. 'స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి 'అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలతో పాటు ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఏబీపీ మనోహర్, డాక్టర్ ఎస్. అనితాదేవి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి ఆర్. జయ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

మేయర్ కావటి మనోహర్ నాయుడు


టాస్ వేస్తున్న మేయర్ కావటి మనోహర్

నెహ్రూనగర్: ఆడుదాం ఆంధ్రా ద్వారా యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసే అవకాశం ఏర్పడిందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలను వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా, కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి స్థానిక బీఆర్ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్య, వైద్యాలకు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అధిక ప్రాధాన్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చారని, అలాగే క్రీడల్లో ఆడుదాం ఆంధ్రా ద్వారా దేశానికే ఆదర్శంగా ప్రతిభకు ఫ్లాట్ ఫామ్ వేస్తున్నారన్నారు. యువత ఆడుదాం ఆంధ్రాని సద్వినియోగం చేసుకోవడం ద్వారా రానున్న కాలంలో క్రీడల ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాలో భాగంగా నగరంలో వార్డు సచివాలయాల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ఉండాలని కోరారు. నగరంలో క్రీడలకు అనుగుణంగా గుర్తించిన ప్లే గ్రౌండ్స్‌లో పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరం నుంచి రాష్ట్ర స్థాయిలో పతకం వచ్చేలా క్రీడాకారులు కృషి చేయాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ టి.వెంకటకృష్ణయ్య, ఎస్ఈ (ఎఫ్ఏసీ) సుందర రామిరెడ్డి, డీఎస్‌డీఓ వెంకటేశ్వర రావు, షేక్ నూరి ఫాతిమా, డీఈఈ శ్రీధర్, కార్పొరేటర్లు మీరావలి, సంతోష్, రాజేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని పద్మావతి, గోదాసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం ధార్మిక ప్రాంగణంలో గత నెల 27 నుంచి ఈనెల 15 వరకు సద్ది కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప, ఇతర దీక్షాపరులకు, భక్తులకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి, దాతల సహకారంతో కొనసాగుతుంది. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ప్రతి రోజు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, శ్రీలలితా పారాయణాలు, చండీ హోమాలు, హనుమాన్ చాలీసా, ఆదిత్య పారాయణాలు, కుంకుమ పూజలు, దీపోత్సవాలు వైభవంగా చేపడుతున్నారు. మార్గశిర పర్వదినాన మాసశివరాత్రి సందర్భంగా ప్రాంగణంలోని వినాయకుడికి, మహాశివలింగానికి బుధవారం విశేష అభిషేకార్చనలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 12 మంది రుత్వికులతో వేదమంత్రాల నడుమ చండీ హోమం మహాపూర్ణాహుతి జరిగింది. ఈ క్రమంలో తీర్థ ప్రసాద వితరణ అన్నదానం నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్. మస్తానయ్య మాట్లాడుతూ ఆదివారం గోద రంగనాథుల కళ్యాణం, సోమవారం అయ్యప్ప స్వామి భజనలు, అభిషేకాలు, మకరజ్యోతి దర్శనం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొల్లేపల్లి రవి, కార్యవర్గ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

కాటూరి మెడికల్ కాలేజీలో ఏఆర్‌టీ సెంటర్


ఏఆర్‌టీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కామేశ్వరప్రసాద్, డాక్టర్ మంజుల

గుంటూరు మెడికల్: యాంటీ రిట్రో వైరల్ థెరపీ (ఏఆర్‌టీ) మందులు ప్రతిరోజూ క్రమంగా వాడటం ద్వారా హెచ్ఐవీ వైరల్ లోడ్ తగ్గించుకుని ఆరోగ్యంగా జీవించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ తెలిపారు. బుధవారం కాటూరి మెడికల్ కాలేజీలో ఏఆర్‌టీ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఏఆర్‌టీ సేవలతో పాటుగా హెచ్ఐవీతో జీవించేవారికి ఇతర ఆరోగ్య సమస్యలకు చికిత్స అందుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల మాట్లడుతూ హెచ్ఐవీతో జీవించేవారు సమయానికి పౌష్టికాహారం తీసుకుని, మానసికంగా ప్రశాంతంగా జీవించాలన్నారు. రోగులకు ఏఆర్‌టీ మందులు అందజేశారు. క్రమం తప్పకుండా సీడీ 4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పెప్ఫార్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ హెపటైటిస్ బీ, సీ పరీక్షలు చేయించుకుని నెగిటివ్ వచ్చినవారు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు, కాలేజీ హాస్పిటల్ డీన్ డాక్టర్ వరప్రసాద్, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్‌రావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు, మైక్రో బయాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శివలీల, సీడీసీ షేర్ ఇండియా సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ జయ కృష్ణ, షేర్ ఇండియా టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభు, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్న కుమార్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకోటి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.